క్లుప్తంగా

తాగునీటి పైపులైన్ల పనులకు శంకుస్థాపన

మోతీనగర్: పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి పైపులైన్లను నిర్మిస్తున్నామని అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్, శ్రీ వివేకానందనగర్, తులసీనగర్‌లలో ఆమె జల మండలి అధికారులతో కలిసి పైపులైన్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం రవికుమార్, వర్కు ఇన్‌స్పెక్టర్ మూర్తి, నాయకులు ఐలయ్య, పిల్లి తిరుపతి, మహమ్మద్ జాహెద్ షరీఫ్ బాబా తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి



నిర్మాణ పనులను పరిశీలించి స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లోని అరబ్‌షాహ్ బాబా దర్గా రిటైనింగ్ వాల్, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

అవంతినగర్ తోట ఎన్నికలు వాయిదా

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట రెసిడెన్షియల్ అసోసియేషన్ ఎన్నికలు ఆగస్టులో నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని సంక్షేమ సంఘం అధ్యక్షుడు గార్లపాటి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 2024 వరకు ప్రస్తుతమున్న అసోసియేషన్ నాయకులే పూర్తి స్థాయిలో యథావిధిగా కొనసాగుతారని తెలిపారు.

యూజీడీ నిర్మాణ పనుల పరిశీలన



కబీర్‌నగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్‌లో కొనసాగుతున్న యూజీడీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ పేర్కొన్నారు. శుక్రవారం కబీర్‌నగర్‌లో యూజీడీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు 80 శాతం పూర్తయ్యాయని అనినారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రస్వామి, సతీష్ చారి, వినోద్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కార్మికులతో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్‌టీసీ డిపోలో శుక్రవారం కార్మికులు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ... బీజేపీ నాయకులు గవర్నర్‌ను అడ్డు పెట్టుకొని ఆర్‌టీసీ కార్మికుల పొట్టకొడుతున్నారని ధ్వజమెత్తారు. ఎవరు ఎన్ని అడ్డంకులు తీసుకొచ్చినా ఆర్‌టీసీ కార్మికుల ఆశయాలను సీఎం కేసీఆర్ నెరవేరుస్తారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు ఆర్‌టీసీ కార్మికులు మద్దతుగా నిలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సతీష్‌గౌడ్, ఆవుల రవీందర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, కార్మికులు మల్లారెడ్డి, అశోక్, ఐలయ్య, రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

చింతల్: బాలానగర్ సర్కిల్-1 సివిల్ సప్లై ఏసీఎస్‌ఓగా బాధ్యతలు చేపట్టిన గంప శ్రీనివాస్‌ను శుక్రవారం బాలానగర్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అమర ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో డీలర్లు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. డీలర్ల సంఘం సభ్యులు వెంకటేశంగౌడ్, మధుసూదన్, శ్రీనివాస్, రాజు, భూషణ్, అజయ్, మధుగౌడ్ తదితరులు ఉన్నారు.

నా జీవితం ప్రజాసేవకే అంకితం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో కొనసాగుతున్న పాదయాత్ర
- గల్లీ గల్లీకి వెళ్లి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే
- మళ్లీ గెలిపించుకుంటామని తెలిపిన మహిళలు



పాదయాత్రగా వస్తున్న ఎమ్మెల్యేకు హారతి ఇచ్చి తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు



సమస్యలను నోట్ చేసుకుంటున్న ఎమ్మెల్యే

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ప్రజలకు వద్దకే మన ఎమ్మెల్యే కార్యక్రమం శుక్రవారం నాల్గో రోజుకు చేరుకుంది. అంజయ్యనగర్, పాములబస్తీ, హరిజనబస్తీ, హస్మత్‌పేట,గౌడబస్తీ, మాలబస్తీ, గొల్లకురుమ సంఘం, ఆంజయ్యనగర్ హనుమాన్ టెంపుల్, జైశంకర్‌నగర్ కాలనీ, మల్లన్నగుడి, ఎస్‌ఆర్‌ఎస్‌పీ క్వార్టర్స్, దుబాయి గేట్, కోరమాండల్ కాలనీ, ఫేర్‌గల్లీ, ఫాతిమా మజీద్, పార్కు విల్లా, అబ్రహార్‌నగర్ ప్రాంతాలలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

◆ డ్రైనేజీ వ్యవస్థలో ఉన్న లోపలను తక్షణమే సరి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరం ఉన్న ప్రాంతాల్లో పైపులైన్లను వేయాలని సూచించారు. పాదయాత్రలో మహిళలు డబుల్‌బెడ్‌రూమ్, పింఛన్లకు సంబంధించి వినతి పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. వాటిని ఆయన సంబంధిత అధికారులకు అందజేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమాచారం అందించాలని తెలిపారు.

◆ **అడుగడుగునా ఎమ్మెల్యేకు నీరాజనాలు..** హస్మత్‌పేట, అంజయ్యనగర్ ప్రాంతాలు ముంపునకు గురికాకుండా బోయిన్ చెరువు వద్ద కల్వర్టు నిర్మించారు. అదే విధంగా చెరువును అభివృద్ధి చేశారు. దీనికి కృతజ్ఞతగా స్థానికులు అడుగడుగునా ఎమ్మెల్యేకు నీరాజనాలు పలికారు. మహిళలు మంగళ హారతులు ఇచ్చి 'మీ వెంటే మేము ఉంటాం.. మీ గెలుపే మా లక్ష్యం'అంటూ శాలువాలు కప్పి స్వాగతించారు. అడిగిన వెంటనే రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి వసతి, శ్మశానవాటిక అభివృద్ధి, ఆలయాల అభివృద్ధి, పింఛన్లు, కల్యాణలక్ష్మి మెరుగైన వైద్యం కోసం పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్, దళితబంధు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని హర్షం వ్యక్తం చేశారు. మరోసారి ఎమ్మెల్యేను గెలిపించుకుంటామని అంజయ్యనగర్‌లో ప్రజలు బహిరంగంగా శపథం చేశారు.

◆ **మీకు సేవ చేయడం కోసమే నేనున్నాను..** ప్రజలకు సేవ చేయడం కోసమే తాను ఉన్నానని.. ప్రజాసేవకే తన జీవితం అంకితమన్నారు. ఎమ్మెల్యే అన్నారు. మీ ఇంటి మనిషిగా ఏ కష్టం వచ్చిన నాకు చెప్పాలని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. నేరుగా ఫోన్ నంబర్ ఇచ్చి ఏ సమస్య వచ్చిన ఎప్పుడైన ఫోన్ చేసి తెలిపాలని ప్రజలను కోరారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రజలు ఆదరించి అప్యాయత చూపి హక్కున చేర్చుకుని రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని గుర్తు చేశారు. జీవితాంతం మీ సేవలో మీ మనస్సులో ఉంటూ సేవ చేస్తానని వచ్చే ఎన్నికల్లో అత్యాధిక మెజారీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బల్వంత్‌రెడ్డి, సయ్యద్ ఏజాజ్, మక్కాల నర్సింగ్‌రావు, కర్రె జంగయ్య, కర్రె లావణ్య, బుర్రి యాదగిరి, మక్కాల సత్యనారాయణ, మేకల హరినాథ్, ఇర్ఫాన్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, కనకరాజుయాదవ్, సంతోష్‌యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, పోచయ్య, మన్నె ఉదయ్, గణేష్, లలితా, ఉదయరాణి, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

◆ **అసాంఘిక కార్యకలపాలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదులు..** పాదయాత్రలో అయా ప్రాంతాలలో జరుగుతున్న అసాంఘిక కార్యకాలపాలపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అంజయ్యనగర్, హస్మత్‌పేట, జయశంకర్‌నగర్ కాలనీ ప్రాంతాలలో గంజాయి తాగుతూ యువత అసాంఘిక కార్యకలపాలకు పాల్పడుతున్నారని వారిని నివారించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి ఇలా చేస్తున్నారని పోలీసులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదని చెప్పడంతో సంబంధిత ఎస్సైని పిలిచి ప్రశ్నించారు. త్వరలో ఏసీపీ, సీఐలతో సమావేశం ఏర్పాటు చేసి నివారణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీసులు అసాంఘిక కార్యకలపాలపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఎస్సైని ఆదేశించారు.





ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్



అంజయ్యనగర్‌లో ఎమ్మెల్యేను శాలువా కప్పి సన్మానిస్తున్న ఓ వృద్ధురాలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో నేటితో ముగియనున్న పాదయాత్ర

ఐదు రోజులుగా 'ప్రజల వద్దకే మన ఎమ్మెల్యే'పాదయాత్ర శనివారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో ముగియనుంది. శనివారం ఉదయం మల్లికార్జునగర్ నగర్, మానస సరోవర్ హైట్స్ ప్రాంతాలలో పాదయాత్ర చేసి అక్కడి సమస్యలను తెలుసుకుంటారు. అనంతరం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నివాసంలో ఎమ్మెల్యే అన్నీ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. పాదయాత్రలో వచ్చిన సమస్యలు వాటి పరిష్కార మార్గాలు, ప్రజలతో నిత్యం అందుబాటులో ఉండి పనులు చేయించడం వంటి వాటిపై సు. దీర్ఘంగా చర్చించనున్నారు.

నేడు ప్రగతి నివేదన బహిరంగ సభ: కార్పొరేటర్

ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తాలో డివిజన్ ప్రగతి నివేదన బహిరంగా సభను ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ తెలిపారు. శనివారం సాయంత్రం 4గంటలకు నిర్వహించబోయే ప్రగతి నివేదన సభ ద్వారా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డివిజన్‌లో చేసిన ప్రగతిని వివరిస్తారని తెలిపారు. ఇప్పటి వరకు డివిజన్ కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలు దీర్ఘకాలికంగా ఎదుర్కొన్న సమస్యలకు చేసిన పరిష్కారాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అన్నింటిని ప్రగతి నివేదన సభ ద్వారా ప్రజలకు వివరించనున్నట్లు వెల్లడించారు. ఈ సభకు సుమారుగా 10వేల మంది ప్రజలు హాజరవుతారని ఆయన తెలిపారు.

'మోదీ పాలనలో దేశం మరింత శక్తివంతమైంది'

బాలానగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశం అభివృద్ధి దిశగా పయనిస్తోందని కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు పేర్కొన్నారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కేసీఆర్ పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీ భరోసా పేరిట బాలానగర్ డివిజన్ ఇందిరానగర్‌లో బీజేపీ శ్రేణులతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో భారతదేశ ఖ్యాతి అంతర్జాతీయంగా ఇనుమడించిందన్నారు. తొమ్మిదేళ్ల పాలనకు సంబంధించి ఇంటింటికీ సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు.

◆ బీఆర్ఎస్ పాలనలో వీధి లైట్లు, రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కూడా కల్పించలేని పరిస్థితి నెలకొందన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధి చెందితే సమస్యలను పరిష్కరించాలని ప్రజలు వినతిపత్రాలను ఎందుకు అందజేస్తున్నారో శాసనసభ్యుడు సమాధానం చెప్పాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలు తెలియజేసుకున్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు రమేష్, సురందర్‌రెడ్డి, మల్లేష్, కల్పన, శివరంజని, లక్ష్మణ్, కొత్తూరు రమేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఇందిరానగర్‌లో పర్యటిస్తున్న మాధవరం కాంతారావు

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లోకి వస్తున్నారు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు పార్టీలో చేరుతున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం వి.రామారావునగర్‌కు చెందిన సుమారు 100 మంది కాంగ్రెస్ నాయకులు బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగుల సత్యం ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సంజీవ్‌పటేల్, చిన్న అబ్బులు, శివయ్య, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు...

అల్లాపూర్ డివిజన్ వి.రామారావునగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.వెంకటయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి బి.వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని శాలువాలతో సన్మానించి అభినందించారు.



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కళాసిల్క్ హస్తకళా మేళాకు స్పందన

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ హస్తకళా మేళాకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు వినోద్ జైన్, సంజయ్ జైన్ పేర్కొన్నారు. ఈ మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చేనేత కళాకారులు తయారు చేసిన ఖాదీ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదే విధంగా వివిధ రకాల చీరలు, కొండపల్లి బొమ్మలు, వన్‌గ్రామ్ గోల్డ్‌తో పాటు గృహోపకరణాలు అందుబాటులో ఉన్నాయి. ఈ మేళా ఈ నెల 10వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. అన్ని రకాల డెబిట్‌కార్డులపై కొనుగోలు చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని మోతీనగర్ పరిసర ప్రాంత వాసులందరూ వినియోగించుకోవాలన్నారు.



కళాసిల్క్ హస్తకళా మేళాలో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి



శివాజీనగర్‌లో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

అల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శివాజీ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సుమారు రూ.35లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్డుమీద నీరు నిలిచిపోకుండా ప్రణాళికాబద్ధంగా నిర్మించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, శివరాజ్‌గౌడ్, జాన్, బాలస్వామి, పోశెట్టిగౌడ్, వాసుదేవరావు, కటిక రవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మోతీనగర్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి వ్యాధులు దరిచేరవని ఎంటమాలజీ మూసాపేట, అల్లాపూర్ ఏఈ టి.నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ రాణా ప్రతాప్‌నగర్‌లోని శ్రీ సరస్వతి హైస్కూల్‌లో ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా, దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అదే విధంగా ఈగలు, దోమలు స్వైర్య విహారం చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఎలాంటి వ్యాధులు దరిచేరవని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉదయ్‌కుమార్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ ఏఈ నగేష్

ఆలీ తలాబ్ చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నాం

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



ఆలీ తలాబ్ చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆలీ తలాబ్‌చెరువు సుందరీకరణలో భాగంగా అలుగు నిర్మాణం, చెరువులో కలుషిత, వ్యర్థ జలాలు కలవకుండా మళ్లింపు, పైపులైన్ నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సుమారు 1 కోటి 83 లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఒకప్పుడు మురికి కూపంలాగా ఉన్న ఆలీ తలాబ్ చెరువుకు మహర్దశ పట్టిందన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సహకారంతో చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

◆ మురుగు నీరు చెరువులో కలవకుండా కాలువ నిర్మాణం, అలుగు మరమ్మతు పనులు, చెరువుకట్టను బలోపేతం, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతున్నామన్నారు. అదే విధంగా చెరువు సంరక్షణలో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి పనులు పక్కా ప్రణాళికతో, నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో అధికారులు ఏఈలు విశ్వం, రాజీవ్, వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డి, కాలనీవాసులు సురేష్, హరి, కోటేశ్వరరావు, సురేష్, విజయ్ కృష్ణ, రంజిత్, చంద్ర, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పాదయాత్ర



దయార్‌గూడలో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: డివిజన్ పరిధిలోని దయార్‌గూడలో సమస్యలపై కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ శుక్రవారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి డివిజన్‌లో అన్ని మౌలిక వసతులు కల్పించటంతో పాటు నిరుపేదలకు పలు పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామని అన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, ప్రభాకర్, బొట్టు విష్ణు, శంకర్, బచ్చలి శ్రీను, నాగరాజు, వెంకటేష్, మహేందర్, రమేష్, సురేష్, జాన్, రాము తదితరులు పాల్గొన్నారు.

విరిగిన చెట్ల కొమ్మలు తొలగింపు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణ వీధిలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు విరిగి పడి విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి సమస్యను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం అధికారులు స్పందించి విరిగిపోయిన చెట్ల కొమ్మలను తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలు, కేబుల్ ఏర్పాటు చేశారు.



ఎమ్మెల్యే గాంధీని కలిసిన కాపు సంఘం నేతలు



ఎమ్మెల్యే గాంధీకి ధన్యవాదాలు తెలుపుతున్న కాపు సంక్షేమ సంఘం నాయకులు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ ప్రభుత్వం కాపు సంక్షేమ సంఘం ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి హైటెక్‌సిటీ దగ్గర 6.35 ఎకరాల స్థలం కేటాయించిన సందర్భంగా శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘాల సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు మిర్యాల రాఘవరావు, జనరల్ సెక్రటరీ కేఎస్ఎస్‌మూర్తి, వైస్ ప్రెసిడెంట్ దాసరి రంగారావు, కూకట్‌పల్లి కాపు సంఘం అధ్యక్షుడు భరత్‌కుమార్, భగవాన్, బసల శ్రీనివాస్, ఆనంద్‌రావు, బుట్టు రాంబాబు, వాసు నాయుడు, ఎదుర్ల సుబ్బారావు, ఆదిమూలం, త్రినాథరావు, కృష్ణ, ప్రసాద్, వీరభద్రరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ఆవరణలో విద్యార్థిని మృతి

- ఆస్పత్రికి తరలించేలోపే మృతి
- తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు



మానస మృతదేహం →

భాగ్యనగర్‌కాలనీ: ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కళాశాల ఆవరణలో స్పృహ తప్పి పడిపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే లోపు మృతి చెందింది. ఈ సంఘటన శుక్రవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆల్విన్‌కాలనీ సాయికల్యాణ మండపం సమీపంలో నివాసం ఉంటున్న వెన్నెల, కృష్ణారెడ్డి దంపతుల కుమార్తె నాగపట్ల మానస (16). తండ్రి పదేళ్ల క్రితమే చనిపోయారు. వెన్నెల ఇంటి వద్దనే ఉంటూ మానసను చదివిస్తోంది.

◆ కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లోని కార్పొరేట్ కళాశాలలో జూనియర్ ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరి ఎంపీసీ గ్రూప్ తీసుకుంది. రోజు మాదిరిగానే మానస ఉదయం ఏడున్నర గంటలకు ఇంటి వద్ద నుంచి కళాశాలకు వచ్చింది. సాయంత్రం 5గంటల సమయంలో కళాశాల విడిచిపెట్టడంతో బయటకు వచ్చిన మానస కళ్లు తిరిగి స్పృహ తప్పి పడిపోయింది.

◆ వెంటనే గమనించిన కళాశాల యాజమాన్యం మానస తల్లికి సమాచారం అందజేశారు. కళాశాలకు చేరుకున్న వెన్నెల తన కూతుర్ని సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు మానసను పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు.

◆ భర్త పదేళ్ల క్రితమే చనిపోవడంతో ఒక్కగానొక్క కూతుర్ని అల్లారుముద్దుగా పెంచుకుంటూ చదివిస్తోంది. తన కూతురు ఇక లేదన్న విషయం తెలుసుకున్న ఆ తల్లి కన్నీరు మున్నీరయ్యింది. తల్లి వెన్నెల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.